
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

శుక్రవారం 19 జులై 2024

ఏయూలో ఏం జరుగుతోంది!?

ప్రసాదరెడ్డి బృందానికే కీలక పదవులు

- ఇన్‌చార్జి వీసీగా నియమితులైన శశిభూషణరావు అందులో సభ్యుడే
- ఎమ్మెల్యేలకు చెప్పకుండానే నియామకం
- తెరవెనుక చక్రం తిప్పిన టీడీపీ యువ నాయకుడు



...వివరాలు 7వ పేజీలో

గూడు లేని బడులెన్నో?

గిరిజన ప్రాంతాల్లో పాకలు, షెడ్లలోనే పాఠశాలల నిర్వహణ

- వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కబడికి భవనం కట్టని దుస్థితి
- నాడు-నేడు పేరిట రూ. కోట్లు వ్యయం చేసినా దక్కని ఫలితం
- నేటికీ జిల్లాలో 260 స్కూళ్లకు శాశ్వత భవనాలు లేవు

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో చాలా పాఠశాలలకు భవనాలు లేని దుస్థితి నెలకొంది. నాడు-నేడులో కార్పొరేట్ స్థాయిలో విద్యాలయాలను అభివృద్ధి చేశామని వైసీపీ పాలకుల ప్రకటనలకు క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు కనీసం పొంతన కుదరడంలేదు. నాడు-నేడు పేరిట రూ.కోట్లు వ్యయం చేసినప్పటికీ, జిల్లాలో 260 గిరిజన పల్లెల్లోని పాఠశాలలకు నేటికీ కనీసం గూడు లేదు. ఏజెన్సీ మారుమూల ముంచంగిపుట్టు మండలం కెందుగూడ ప్రాథమిక పాఠశాలలకు భవనం లేక విద్యార్థుల తల్లిదండ్రులే శ్రమదానంలో పాక నిర్మించడం, దానిపై రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించడంతో గిరిజన ప్రాంతంలో భవనాలు లేని బడుల విషయం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.



పెదబయలు మండలం బొడ్డగొంది ప్రాథమిక పాఠశాల ఇదే



పెంకుల ఇంట్లో నడుస్తున్న పాడేరు మండలం బూరుగుచట్టు ప్రాథమిక పాఠశాల

విద్యా రంగంలో సంస్కరణలు తీసుకువచ్చామని విస్తృత ప్రచారం చేస్తున్న వైసీపీ ప్రభుత్వం గడచిన ఐదేళ్లలో జిల్లాలోని ఒక్క చోట కూడా బడికి భవనం కట్టిన దాఖలాలు లేవు. కేవలం నాడు-నేడు పేరిట మొత్తం పాఠశాలల్లో పది శాతం పాఠశాలల్ని ఎంపిక చేసుకుని, వాటికే కోట్లాది రూపాయలు వ్యయం చేసి, అనవసర హంగులు చేయడం మినహా క్షేత్ర స్థాయిలో కనీసం గూడు లేని బడుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఈ ఐదేళ్లలో గూడు లేని పాఠశాలలకు భవనాలు సమకూరని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా గతేడాది నవంబరులో అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సైతం జిల్లా వ్యాప్తంగా 260 పాఠశాలలకు భవనాలు లేవని, వాటికి భవనాలు మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కాని ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. అలాగే గిరిజన పల్లెల్లోని ఈ సమస్యను గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మీడియా పలు మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ కనీసం స్పందించలేదు. దీంతో చేసేది లేక బాధిత గిరిజనులు సైతం ఇన్నాళ్లు మిన్నకున్నారు. కొన్నిచోట్ల తమకున్న అవకాశం మేరకు శ్రమదానంతో విద్యార్థుల తల్లిదండ్రులే తమ పాఠశాలకు గూడు కట్టుకున్నారు. ఉదాహరణకు పెదబయలు మండలం కొరవంగి పంచాయతీ పరిధిలో బొడ్డగొంది ప్రాథమిక పాఠశాలకు ఎటువంటి భవనం లేదు. దీంతో తొలుత ప్లాస్టిక్ కవర్ల నీడ తోనే పాకను నిర్వహించగా, వర్షాకాలంలో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన తల్లిదండ్రులు తర్వాత పెంకులతో షెడ్‌ను నిర్మించారు. దీంతో ప్రస్తుతం దానిలోనే బొడ్డగొంది ప్రాథమిక పాఠశాల నిర్వహిస్తున్నారు.

కెందుగూడ పాఠశాల వెలుగులోకి రావడంతో..

ముంచంగిపుట్టు మండలం కెందుగూడ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులే శ్రమదానంతో రేకుల షెడ్డు నిర్మించుకోవడం, ఆ విషయం రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి వెళ్లడంతో పాఠశాలకు రూ.15 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఏజెన్సీలో పాఠశాలలకు భవనాలు లేని విషయం చర్చనీయాంశమైంది. భవనాలు లేని పాఠశాలలకు సంబంధించిన ఫిర్యాదులు ప్రస్తుతం అధికారుల దృష్టికి వస్తున్నాయి. మరికొందరు ఒక అడుగు ముందుకేసి తాము సొంతంగా పాఠశాలల షెడ్డు వేశామని, అందుకు నిధులు ఇవ్వాలని కోరుతుండగా, మరికొందరు శ్రమదానంతో తాము నిర్మించిన రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు సంబంధించిన సమస్యలు పట్టించుకోకపోవడంతో వారు కూడా చేసేది లేక మిన్నకున్నారు. కాని కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా ప్రజల సమస్యలపై తక్షణమే స్పందిస్తుండడంతో అనేక సమస్యలను ప్రజలు అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువస్తున్నారు.

భవనాల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం భరోసా..

జిల్లాలో ముంచంగిపుట్టు మండలం కెందుగుడ పాఠశాల షెడ్ వ్యవహారం వెలుగు చూడడంతో రాష్ట్ర మానవ వనరుల, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ రాష్ట్రంలో గిరిజన ప్రాంతంలో భవనాలు లేని 408 పాఠశాలలకు భవనాలను నిర్మించేందుకు రూ.56 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇదే విషయాన్ని ఈనెల 10న ఇక్కడికి వచ్చిన రాష్ట్ర ఐసీడీఎస్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అధికారుల సమావేశంలో తెలిపారు. దీంతో గూడు లేని పాఠశాలలకు భవనాలు సమకూరుతాయనే భరోసా కూటమి ప్రభుత్వం కల్పించినట్టయింది. ఇదే అదనుగా గిరిజన ప్రాంతంలో భవనాలు లేని పాఠశాలలున్న గ్రామస్థులు, తమ బడికి భవనం కావాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో భవనాలు లేని పాఠశాలలు, విద్యార్థుల వివరాలు..

వ.సం	మండలం	భవనాలు లేని పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
1.	అనంతగిరి	37	825
2.	అరకులోయ	8	174
3.	చింతపల్లి	4	66
4.	జీకేవీధి	14	220
5.	జి.మాడుగుల	15	208
6.	హుకుంపేట	12	190
7.	కొయ్యూరు	14	216
8.	ముంచంగిపుట్టు	43	865
9.	పాడేరు	4	66
10.	పెదబయలు	15	260
11.	డుంబ్రిగుడ	8	117
12.	అడ్డతీగల	10	209
13.	చింతూరు	5	48
14.	దేవీపట్నం	10	186
15.	కూనవరం	1	12
16.	మారేడుమిల్లి	13	232
17.	నెల్లిపాక	4	69
18.	రాజవొమ్మంగి	6	124
19.	రంపచోడవరం	6	266
20.	వీఆర్.పురం	2	20
21.	వై.రామవరం	29	268
మొత్తం		260	4,741

మలేరియా మరణాలు సంభవించకూడదు

అధికారులకు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశం

- ఐటీడీఏ పీవోలు, డీఎంహెచ్‌వో, డీఎంవో, పీహెచ్‌సీ వైద్యులతో సమావేశం



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్నకలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలేరియా మరణాలు సంభవించకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం మలేరియా నియంత్రణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కంటే ప్రస్తుతం మలేయా కేసులు తగ్గుముఖం పట్టాయనే ధీమాతో మాత్రం యంత్రాంగం ఉండవద్దని, మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే కేసులు పెరిగితే పని పెరుగుతుందనే భావనతో కాకుండా.. మలేరియాతో మరణాలు సంభవించకుండా చికిత్స అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అలాగే తొలి విడత దోమల నివారణ మందు పిచికారీ పూర్తయిందని, రెండో విడతను పక్కాగా నిర్వహించాలని, ఇళ్లలో లోపల సైతం మందు పిచికారీ చేయాలని కలెకర్ సూచించారు. అందుకు ప్రజలు అంగీకరించకపోతే గ్రామ పెద్దలు లేదా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో చెప్పి వారికి ఒప్పించాలన్నారు. అలాగే దోమల మందు పిచికారీకి సంబంధించి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏడు ప్రాంతాలుగా విభజించి ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలో మందు పిచికారీ పనులు చేపట్టాలన్నారు. అలాగే మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలకు బాధితులు మన వద్దకు వచ్చేకంటే, మనమే వారి వద్దకు వెళ్లి పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఐటీడీఏ పీవోలు, వైద్యులు, పంచాయతీ సిబ్బంది జిల్లాలో మలేరియా విజృంభించకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారామెడికల్ సిబ్బంది వద్ద అవసరమైన రాపిడ్ టెస్టింగ్ కిట్‌లు, మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే ఒక ప్రాంతంలో మలేరియా పాజిటివ్ కేసు నమోదైతే, ఆ ప్రాంతం చుట్టు పక్కల జనాలకు మాస్ స్ర్కీనింగ్ చేయాలని, హైరిస్క్ గ్రామాలపై మరింత దృష్టి సారించాలన్నారు. యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాలను ఉధృతం చేయాలని, ఇంటింటా జ్వరాల సర్వేను పక్కగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు అభిషేక్, సూరజ్ గనోరే, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, వైద్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ రాక

- గిరిజన నేతలతో భేటీ, అభివృద్ధిపై అధికారులతో సమీక్షలు
- నేటి మీ కోసం కార్యక్రమం రద్దు



హుస్సేన్

పాడేరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ గిరిజన తెగల కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ శుక్రవారం జిల్లాకు విచ్చేయనున్నారు. విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గంలో శుక్రవారం ఉదయం బయలుదేరి పది గంటలకు పాడేరు చేరుకుంటారు. తొలుతగా గిరిజన ఉద్యోగుల భవన్‌లో అన్ని గిరిజన సంఘాల ప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం కలెక్టరేట్‌లో వివిధ శాఖలకు చెందిన అధికారులతో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై చేపడుతున్న చర్యలపై చర్చిస్తారు. అనంత రం అరకులోయ వెళ్లి హరితా రిస్టార్టులో టూరిజం, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించిన తర్వాత విశాఖపట్నం బయలుదేరుతారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించాల్సిన మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ తెలిపారు. ఈ మార్పును గిరిజన ప్రజలు గమనించాలని, తమ అర్జీలను సమర్పించేందుకు ఐటీడీఏ కార్యాలయానికి ఎవరూ రావద్దని కలెక్టర్ కోరారు.

మన్యంలో ముసురు

జన జీవనానికి అంతరాయం

పొంగుతున్న వాగులు, వంకలు

- వ్యవసాయ పనుల్లో గిరిజనులు నిమగ్నం
- డుంబ్రిగుడ మండలంలో పడిపోయిన ఇల్లు

పాడేరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి):

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఏజెన్సీలో గురువారం ముసురు వాతావరణం నెలకొంది. దీంతో జిల్లా కేంద్రంలో జల్లులు పడగా.. ఇతర ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. గత నాలుగు రోజులుగా ఏజెన్సీ వ్యాప్తంగా ఆకాశం మేఘావృతం కాగా ఒడిశాకు సరిహద్దుగా ఉన్న పెదబయలు, ముంచంగిపుట్టు, జీకేవీధి మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అలాగే పలు ప్రాంతాల్లో అప్పుడప్పుడు జల్లులతో కూడిన వాన పడుతున్నది. ప్రస్తుత వాతావరణానికి జనజీవనానికి అంతరాయం ఏర్పడుతున్నది. ప్రస్తుత వర్షాలకు ఏజెన్సీలో గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. అలాగే ఖరీఫ్ సీజన్‌లోని వ్యవసాయ పనులు వర్షాలతో జోరందుకున్నాయి. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పాడేరులో పడుతున్న చిరుజల్లులు



ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ

ఉధృతంగా మత్స్యగెడ్డ పాయలు

ముంచంగిపుట్టు: మండలంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కుండపోత వర్షం కురిసింది. దీంతో మండలంలోని వాగులు వంకలు, మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లక్ష్మీపురం పంచాయతీ పరిధిలో పలుచోట్ల మత్స్యగెడ్డ పాయలు ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల పంట పొలాలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల చిన్నపాటి రేకు షెడ్డుల్లో నిర్వహిస్తున్న పాఠశాలల్లో విద్యార్థులు వర్షాలకు ఇబ్బందులు పడుతున్నారు. వరదనీరు తరగతి గదుల్లోకి ప్రవేశించడంతో విద్యార్థులు కూర్చొనేందుకు సైతం ఇబ్బంది పడ్డారు. రహదారులు దెబ్బతిన్నాయి. జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో నీటి నిల్వలు గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్నాయి.

నేలమట్టమైన ఇల్లు

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయతీ శివారు గ్రామమైన గొప్పులవలసలో భారీ వర్షానికి కోర్రా నూకన్న అనే ... మిగతా 8వ పేజీలో

వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

- సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలి
- చింతూరు డివిజన్‌లో 174 గ్రామాలకు వరద ప్రభావం
- గజ ఈతగాళ్లు, బోట్లు సిద్ధంగా ఉంచాం
- జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశం



అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉంటూ సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. వరదల నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వరద సహాయక చర్యలకు సంబంధించిన సామగ్రి, ఇతర పరికరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాలకు తాత్కాలిక లేఅవుట్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన నిత్యావసర సరకులు సిద్ధం చేయాలన్నారు. అంతకుముందు వరదలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యద ర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేశ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో చింతూరు డివిజన్ పరిధిలో 174 గ్రామాలకు వరద ప్రభావం ఉంటుందని, అక్కడి అధికారులను అప్రమత్తం చేశామన్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక రాగానే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని, అవసరమైన బోట్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే 8,800 టార్పాలిన్లు, 20 జనరేటర్లను సమకూరుస్తున్నామని, వరద ముంపు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, అధికారులు పాల్గొన్నారు.

గిరి యువత గంజాయి జోలికి పోవద్దు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

- వసతి గృహంలో జరిగిన ఘటనలపై కలెక్టర్, పీవోలకు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

పాడేరురూరల్, జూలై 18: గిరిజన ప్రాంత యువత గంజాయి జోలికి పోయి బతుకులు నాశనం చేసుకోవద్దని తెలుగు దేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం వైపే చూపిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. గిరిజన యువత గంజాయికి బానిసలై వసతి గృహాలలో ఘర్షణలకు దిగుతున్నారన్నారు. జి.మాడుగుల ప్రభుత్వ వసతిగృహంలో ఇటీవల జరిగిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని గురువారం ఆమె జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్‌లకు వినతిపత్రాలను సమర్పించారు. వసతి గృహంలోకి గంజాయి ఎలా వచ్చిందో నిగ్గుతేల్చి, బాధ్యులపై చర్యలు చేపట్టాలన్నారు. మన్యంలోని ... మిగతా 8వ పేజీలో

ఏయూ ఇన్‌చార్జి వీసీగా శశిభూషణరావు

- వర్సిటీకి చెందిన మరో ఇద్దరు ప్రొఫెసర్లకు ఇన్‌చార్జి వీసీలుగా అవకాశం
- ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ వీసీగా డీవీఆర్ మూర్తి
- కడప ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ వీసీగా విశ్వనాథకుమార్

విశాఖపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్లను నియమిస్తూ గురువారం ఉన్నత విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శశిభూషణరావును నియమించారు. జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా, ఏయూ ఆర్కిటెక్చర్ విభాగం ప్రొఫెసర్ జి.విశ్వనాథ కుమార్ వైఎస్ఆర్ జిల్లాలోని ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా నియమితులయ్యారు.



శశిభూషణరావు

శశిభూషణరావు బాధ్యతల స్వీకారం

ఏయూ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ జి.శశిభూషణరావు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్. ప్రస్తుతం ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. బోధనలో 35 ఏళ్ల అనుభవం ఉంది. ఏయూలో బీటెక్, జేఎన్‌టీయూలో ఎంటెక్, ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. ఆయన పర్యవేక్షణలో 51 మంది డాక్టరేట్లు తీసుకున్నారు. 275కి పైగా పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. ఐదు పాఠ్యపుస్తకాలు, వివిధ పుస్తకాల్లో 11 అధ్యాయాలు ఆయన రచించారు. ఆయన 2008లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ అకడమిషియన్ అవార్డును అందుకున్నారు. బెస్ట్ రీసెర్చర్ అవార్డు కూడా లభించింది. ఆయన పర్యవేక్షణలో తొమ్మిది రీసెర్చి ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి ఏయూ జర్నలిజం విభాగంలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం పరీక్షల విభాగం డీన్‌గా వ్యవహరిస్తున్నారు. జర్నలిజం విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, అంతర్జాతీయ బాషల అధ్యయన విభాగం డీన్‌గా, జపనీస్ సెంటర్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అంతకు ముందు ఆయన డెక్కన్ క్రానికల్ దినపత్రిక ఎడిటోరియల్ విభాగంలో పనిచేశారు. వైఎస్ఆర్ జిల్లాలోని ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ ప్రస్తుతం ఏయూలో ఆ విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

బర్త్ సర్టిఫికెట్‌కు వసూళ్లపై డీసీహెచ్ఎస్ విచారణ

- జీతాల బిల్లులు పెట్టేందుకు కూడా వసూళ్లు
- సెలవులో సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్
- ఐటీడీఏ పీవోకి ప్రాథమిక నివేదిక : డీసీహెచ్ఎస్

రూ.500 తీసుకున్నారని డాక్టర్లు, సిబ్బంది నిర్ధారణ



వైద్యాధికారులను విచారిస్తున్న డీసీహెచ్ఎస్ కృష్ణారావు

చింతపల్లి, జూలై 18: స్థానిక ఏరియా ఆస్పత్రిలో జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసేందుకు సూపరింటెండెంట్ నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై పాడేరు డీసీహెచ్ఎస్ కె. కృష్ణారావు విచారణ చేపట్టారు. కొంతకాలంగా ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ చంద్రశేఖరరావు జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసేందుకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారని కొంతమంది బాధితులు ఐటీడీఏ పీవోకి ఫిర్యాదు చేశారు. దీంతో పీవో ఆదేశాల మేరకు గురువారం ఏరియా ఆస్పత్రిని సందర్శించిన ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

గంజాయి కేసులో ఐదేళ్లు జైలు

అనకాపల్లి టౌన్, జూలై 18: గంజాయి రవాణా కేసులో పట్టుబడిన ఒక వ్యక్తికి గురువారం పదవ అదనపు జిల్లా జడ్జి నందనవనం శ్రీవిద్య ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధించారని జిల్లా ఎస్పీ ఎం.దీపిక పాటిల్ తెలిపారు. 2018 నవంబరు రెండవ తేదీన స్టేషన్ రోడ్డులో ఎనిమిది కిలోల గంజాయితో ఏలూరు జిల్లా నూజివీడు ప్రాంతానికి చెందిన బొల్లా రాజును ఏఎస్ఐ వి. అప్పారావు తన సిబ్బంది పట్టుకున్నారు. దీంతో అప్పటి ఎస్ఐ వి.చక్రధరరావు నిందితుడు రాజును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. విచారణ పూర్తయిన తర్వాత జిల్లా న్యాయమూర్తి నిందితుడు రాజుకు ఐదేళ్ల కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధించినట్టు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసును పీపీ వడ్డాది వెంకటరావు, ఎస్ఐ చక్రధరరావు, సిబ్బంది, మోనటరింగ్ సెల్ సిబ్బందిని జిల్లా ఎస్పీ దీపిక అభినందించారు.

భవనం పైనుంచి పడి తాపీమేస్త్రీ మృతి

పరవాడ, జూలై 18 : మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి ప్రమాదవశాత్తూ కిందకు పడిపోవడంతో తాపీమేస్త్రీ మృతి చెందాడు. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో బండారు సింహాచలం నాయుడు నూతన భవన నిర్మాణాన్ని చేపడుతున్నారు. దీనిలో భాగంగా గురువారం భవనం రెండో అంతస్తుపై పిట్టగోడ కడుతున్న తాపీమేస్త్రీ అమరపు సురేశ్(35) ప్రమాదవశాత్తూ కాలు జారి కిందకు పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే తోటి కూలీలతో పాటు భవన యజమాని చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే సురేశ్ మృతి చెందినట్టు నిర్ధారించారు. సురేశ్ స్వస్థలం విజయనగరం జిల్లా మక్కువ మండలంలోని పాయకపాడు గ్రామం. గత ఏడాదిన్నరగా గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి జేఎన్ఎన్ యూఆర్ఎం కాలనీలో కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. మృతుడు సురేశ్‌కు భార్య స్వాతి, ఆరేళ్ల కుమార్తె, ఐదేళ్ల బాబు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం కుటుంబసభ్యులకు అప్పగిస్తామన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బాల సూర్యారావు తెలిపారు.


మృతుడు అమరపు సురేశ్ (ఫైల్ ఫొటో)

క్షణికావేశంలో వ్యక్తి ఆత్మహత్య

గోపాలపట్నం, జూలై 18: పిల్లలు కరెన్సీ నోట్లు చింపేశారని క్షణికావేశంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన చందన్‌కుమార్(33) రైల్వేలో అసిస్టెంట్ లోకో పైలట్‌గా పని చేస్తున్నారు. ఆయన భార్య లాల్ మున్నీకుమారి, ఇద్దరు పిల్లలతో కొత్తపాలెం గణపతినగర్‌లో ఐదేళ్లగా నివసిస్తున్నారు. బుధవారం రాత్రి చందన్‌కుమార్ పిల్లలు ఆయన జేబులోని కొన్ని కరెన్సీ నోట్లను తీసి చింపేశారు. దీంతో ఆయన తన గదిలోకి వెళ్లి క్షణికావేశంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎంతసేపటికీ భర్త గది తలుపులు తీయకపోవడంతో అనుమానంతో మున్నీకుమారి చుట్టుపక్కల వారి సాయంతో బలవంతంగా తలుపులు తెరిచి చూడగా చందన్‌కుమార్ ఉరి వేసుకుని ఉండడంతో గోపాలపట్నం పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి, ఆత్మహత్యకు గల కారణాలను మున్నీకుమారిని అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి సీఐ సురేశ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

» కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణనష్టం జరగకుండా యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన వివిధ విభాగాల అధికారులతో సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 213 హానికర, రెడ్ కేటగిరీ కింద 143 పరిశ్రమలను పరిశీలించామన్నారు. మిగిలిన 70 పరిశ్రమలను పరిశీలించాల్సి ఉందని వివరించారు. రాబోయే నెల రోజుల్లో 40 పరిశ్రమలను పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించి, పరిశ్రమల్లో పాటిస్తున్న భద్రత ప్రమాణాలపై నివేదిక తయారు చేయాలన్నారు. గతంలో తనిఖీలు చేసిన 143 పరిశ్రమలను కూడా మళ్లీ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి, భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్డీవో చిన్నికృష్ణ, జిల్లా పరిశ్రమల శాఖాధికారి చిన్నికృష్ణ, డీఆర్ఓ శ్రీనివాసరావు,అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై వీడియో కాన్ఫరెన్స్

వైద్య, ఆరోగ్యశాఖ, ప్రకృతి వైపరీత్యాలు, పంచాయతీరాజ్ శాఖలపై గురువారం జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ విజయకృష్ణన్, డీఆర్ఓ శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ బాలాజీ, జడ్పీ సీఈఓ పోలినాయుడు పాల్గొన్నారు.

లెప్రసీ కేస్ నిర్ధారణ సర్వే తనిఖీ

పాయకరావుపేట, జూలై 18 : స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికి తిరిగి చేపడుతున్న లెప్రసీ కేస్ నిర్ధారణ సర్వేని గురువారం డీఎంహెచ్ఓ డాక్టర్ బాలాజీ పరిశీలించారు. పట్టణంలో సచివాలయం-4, 5 పరిధిలో పర్యటించిన ఆయన సిబ్బంది చేపట్టిన సర్వే వివరాల రికార్డులను తనిఖీచేసి, పలు సూచనలు చేశారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సుభాష్, డాక్టర్ వీఎస్.సౌందర్య తదితరులున్నారు.


ఎల్‌సీడీసీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ

వసంత్ కెమికల్స్‌లో ప్రమాదంపై ఎంపీ దిగ్భ్రాంతి

తుమ్మపాల, జూలై 18 : రాంబిల్లి మండలంలో వసంత్ కెమికల్స్ ప్రొడక్షన్ బ్లాక్-6లో బుధవారం జరిగిన ప్రమాదంపై అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఒడిశాకు చెందిన ప్రదీప్‌రౌత్ అనే కార్మికుడు మృతి చెందడంపై విచారం వెలిబుచ్చారు. ప్రమాదానికి కారణాలపై సమగ్ర విచారణ చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

అప్పన్న దర్శన వేళల్లో మార్పులు

సింహాచలం, జూలై 18 : ఈనెల 21న తుది విడత చందన సమర్పణ, 20న సింహగిరి ప్రదక్షిణ పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి అంతరాలయ దర్శనాలు, అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేసినట్టు ఈఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 20న ఉదయం 6.30 నుంచి 2.30 వరకు లఘు దర్శనాలు, 2.30 నుంచి 3 గంటల వరకు పవళింపు సేవ విరామం తరువాత రాత్రి 7 గంటల వరకు, 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు రాత్రి ఆరాధన విరామం తరువాత తిరిగి 10 గంటల వరకు దర్శనాలు కల్పిస్తారు. 21న వేకువజామున 2.00 గంటలకు సుప్రభాత (ఏకాంత) సేవ, 3.00 వరకు స్వామివారికి తుది విడత చందన సమర్పణ, 3 నుంచి ఆలయ ప్రదక్షిణలకు బయట ప్రాకారం చుట్టూ అనుమతిస్తారు. 3 నుంచి 4.30 వరకు ప్రభాతారాధనలు, బాల భోగం, రాజభోగం నివేదలు. ఉదయం 5.00 నుంచి సాయంత్రం 4.00 వరకు నిర్విరామంగా భక్తులకు దర్శనాలు లభిస్తాయి. సాయంత్రం 4 నుంచి 5.30 వరకు ఆలయ బేడా మండపంలో ఢిల్లీ విజయం ఉత్సవం కావడంతో దర్శనాలు లభించవు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 వరకు దర్శనాలు కలిపించి, రాత్రి 7 నుంచి 8.30 వరకు రాత్రి ఆరాధన, 8.30 నుంచి రాత్రి 9 వరకు తిరిగి భక్తులకు దర్శనాలు లభిస్తాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ఈనెల 20, 21 తేదీల్లో ఎటువంటి సిఫార్సు లేఖలను అనమతించమని ఈఓ స్పష్టం చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

అమర్‌నాథ్ భూ దందాల చిట్టా సిద్ధం

» మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

తుమ్మపాల, జూలై 18: వైసీపీ పాలనలో మంత్రిగా పనిచేసిన గుడివాడ అమర్‌నాథ్ నియోజకవర్గంలో సాగించిన భూదందాల చిట్టా సిద్ధమైందని, త్వరలో జైలుకు వెళ్లడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్పష్టం చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కశింకోట మండలం విసన్నపేట సర్వే నంబరు 195/2లో దాదాపు 600 ఎకరాలు, అనకాపల్లి మండలం బీఆర్టీ కాలనీ సర్వే నంబరుల్లో 81, 371ల్లో దాదాపు 88 ఎకరాలు, అనకాపల్లి మండలంలో జరిగిన ల్యాండ్ పూలింగ్‌లో సేకరించిన 1500 ఎకరాల్లో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు పలువురు వైసీపీ నాయకులు భూదందాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అందరి భరతం పట్టడం ఖాయమన్నారు. ఈ అంశం పై ఇప్పటికే రెవెన్యూ మంత్రితో మాట్లాడడం జరిగిందన్నారు. పూర్తి ఆధారాలతో చిట్టాను టీడీపీ అధిష్ఠానానికి అందజేయడం జరిగిందన్నారు. గత ఐదేళ్లలో ఉమ్మడి విశాఖ జిల్లాలో వైసీపీ నాయకులు భారీ భూకబ్జాలకు పాల్పడ్డారన్నారు. ప్రధానంగా విజయసాయిరెడ్డి, గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు అప్పటి సీఎస్‌గా పనిచేసిన జవహర్‌రెడ్డి సైతం ఉన్నారన్నారు. ఈ భూదందాలపై గతంలో జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా దర్బార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పేరిట పంపిణీ చేసిన మెటీరియల్ సైతం భారీగా దోచుకుని కోట్లాది రూపాయల అక్రమాలకు పాల్పడ్డారన్నారు. గత వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి అవినీతి నాయకులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, బీఎస్ఎంకే జోగినాయుడు, నారపిన్ని చంద్రశేఖర్, సందిన సునీల్, సబ్బవరపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

నిజాయితీగా పని చేస్తే ఉండండి.. లేకుంటే బదిలీపై వెళ్లిపోండి

» ప్రభుత్వ భూములు ధారదత్తం చేస్తే కఠిన చర్యలు

» ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ హెచ్చరిక

అచ్యుతాపురం, జూలై 18: నిజాయితీగా పని చేస్తే ఉండండి.. లేకుంటే బదిలీపై వెళ్లిపొండి అని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక ఒక ప్రైవేటు సమావేశమందిరంలో జరిగిన ఎలమంచిలి నియోజకవర్గం కార్యదర్శులు, వీఆర్వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించకుండా రాజకీయ నేతల ప్రాపకం కోసం ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇకపై అటువంటివి సాగవని, సక్రమంగా విధులు నిర్వహించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి ప్రభుత్వ భూముల రికార్డులు ధారాదత్తం చేస్తున్నారని, బుధవారం కూడా ఎలమంచిలిలో ఇదే విధంగా పదెకరాల భూమి వ్యవహారాన్ని తాను అడ్డుకున్నానన్నారు. ఇలా గతంలో చేతివాటం చేసిన వారందరిపై తప్పకుండా కఠిన చర్యలు చేపడతానన్నారు. మండలంలో ప్రతి పనికి రైతుల నుంచి వసూళ్లు చేశారని, ఆ పద్ధతి మార్చుకోవాలన్నారు. జీతం చాలడం లేదని తనతో చెబితే ఉద్యోగాలకు రాజీనామా చేసి తన వద్దకు వస్తే కాంట్రాక్టు పనులు ఇప్పిస్తాననన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఎంపీడీఓ సురేష్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డీపీఓ శిరీషారాణి, నాలుగు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఏరియా ఆస్పత్రిలో మెరుగైన సేవలకు చర్యలు

» త్వరలో ఆస్పతి అభివృద్ధి కమిటీ సమావేశం

» కలెక్టర్ విజయకృష్ణన్

నర్సీపట్నం, జూలై 18: ఏరియా ఆస్పత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. గురువారం నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో జయరాం కార్యాలయం ఆవరణలో ఆమెతో మొక్క నాటించారు. కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందిని పరిచయం చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పిచ్చి మొక్కలు మొలిచి ఉండడాన్ని గమనించిన ఆమె.. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని శుభ్రం చేయించాలని ఆదేశించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ త్వరలో ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మునిసిపాలిటీలో పారిశుధ్య సమస్య పరిష్కారానికి స్పీకర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్‌పై సమీక్ష చేసి మునిసిపాలిటీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.


మొక్క నాటుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

కార్యాలయాల్లో మహిళల రక్షణకు కమిటీలు ఏర్పాటు

» తహసీల్దార్ కార్యాలయంలో కమిటీ ఏర్పాటు

అనకాపల్లి టౌన్, జూలై 18: మహిళలు పనిచేసేచోట వారి భద్రత కోసం ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు చేపడుతోంది. దీంట్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెల్ కంప్లయింట్ కమిటీలను నియమిస్తోంది. కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళలపై లైంగిక వేధింపులు జరగకుండా చూడడం కోసం ఐదుగురు సభ్యులతో కమిటీలను వేస్తున్నది. ఇందులో భాగంగా ఐసీడీఎస్ అదనపు సీడీపీవో శశికళ గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్ శ్రీనివాసరావుతో కమిటీ నియామకంపై చర్చించారు. ఈ కమిటీలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు సభ్యులు, ఒక ఎన్‌జీవో ఉంటారని శశికళ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళలు పనిచేసే కార్యాలయాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని ఆమె తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో కూడా ఒక కమిటీని నియమించారు. అన్ని కార్యాలయాల్లోనూ కమిటీలను నియమించడం జరుగుతుందన్నారు. ఏ కార్యాలయంలోనైనా మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులకు గురైతే కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లిన తరువాత సమస్య పరిష్కారమయ్యేలా అధికారులు చొరవ చూపుతారు. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కమిటీల నియామకాలు జిల్లా వ్యాప్తంగా సాగుతున్నాయి.


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న శశికళ

హెల్మెట్‌తో ప్రజలకు రక్షణ

» అనకాపల్లి జిల్లా జడ్జి శ్రీవిద్య » హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ

అనకాపల్లి టౌన్, జూలై 18 : ప్రమాదాల నుంచి రక్షించుకునేందుకు వాహనచోదకులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని పదవ అదనపు జిల్లా ఎన్. శ్రీవిద్య సూచించారు. అనకాపల్లి మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రమాదాలపై అవగాహన కల్పించడంలో భాగంగా న్యాయమూర్తులు, న్యాయవాదులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో కుటుంబాలు ప్రమాదాల వల్ల రోడ్డు పాలవుతున్నారన్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా వాహనచోదకులు, వాహనం వెనుక కూర్చున్నవారు సైతం హెల్మెట్ ధరిస్తే మంచిదని సూచించారు. కోర్టు సముదాయాల నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమేష్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎన్ కుమార్, కార్యదర్శి దుర్గారావు, మహిళా ప్రతినిధి కేతా కుసుమ, ట్రాఫిక్ సీఐ పి. సైడపునాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

నాక్ గుర్తింపు బృందం ఏఎంఏఎల్ కళాశాల సందర్శన

కొత్తూరు, జూలై 18 : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలను నాక్ గుర్తింపు బృందం గురువారం సందర్శించింది. హిమాచల్‌ప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ హన్స్‌రాజ్ శర్మ, తమిళనాడు కోయంబత్తూరు హోమ్ సైన్స్ అండ్ హైర్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఉమెన్ డీన్ డాక్టర్ జెరీనాబి ఉబైదుల్లా, కర్ణాటక ఏవీ.కాంతమ్మ ఉమెన్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజకుమారి జవరాజిగౌడ, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కళాశాలలోని వసతి, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఈ బృందానికి కళాశాల ప్రాముఖ్యతను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వివరించారు. ప్రొఫెసర్ హన్స్‌రాజ్ శర్ మాట్లాడుతూ కళాశాలకు సంబంధించి పూర్తి సమాచారం సేకరించి, ఆ నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు అందజేస్తామని చెప్పారు. అంతకు ముందు బృందం సభ్యులు కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు గౌరవవందనాన్ని సమర్పించారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కృష్ణంరాజు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐజీ మళ్ల వెంకటేశ్వరరావు, మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర సంచాలకులు కర్రి అప్పారావు, ప్రొఫెసర్ ఎంవీ.కామరాజు, ప్రముఖ వైద్యులు డాక్టర్ జేపీవీ సుబ్రహ్మణ్యం, డాక్టర్ కర్రి భాస్కరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు, కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

కొండెంపూడిలో స్వాధీన భూములకు పోలీసుల పహారా

బుచ్చెయ్యపేట, జూలై 18: మండలంలోని కొండెంపూడి రెవెన్యూ సర్వే నంబరు 5లో గల ఐదు ఎకరాల స్వాధీన భూములకు బుచ్చెయ్యపేట పోలీసులు పహారా కాస్తున్నారు. 1993లో కడియాల రామారావు, సాంబశివరావులకు ప్రభుత్వం డీ ఫారమ్ పట్టాలు మంజూరు చేసింది. వారు లంకా సత్యనారాయణ, పినపాత్రుని వెంకటరమణ, సత్యనారాయణ, సోమిరెడ్డి రాము, గొల్లవిల్లి ఈశ్వరరావులకు లీజుకు ఇచ్చారు. 2014-19 సంవత్సరంలో కొండెంపూడిలో ఏర్పాటు చేసిన కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన సుమారు 50 ఎకరాల బంజర్ల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులు సర్వే నంబరు 5లో భూములను కేటాయించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన భూ నిర్వాసిత రైతులు ఎ.సత్యనారాయణ, దొండా శ్రీను ఆధ్వర్యంలో కొంత మంది నిర్వాసిత రైతులు సర్వే నంబరు 5లో గల భూములను ట్రాక్టరుతో దున్నేశారు. దీంతో భూ నిర్వాసితులు, లీజుదారులకు వారి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. దీంతో ఎస్ఐ డి.ఈశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను శాంతింపజేశారు. ఈ భూములు డీ ఫారమ్ పట్టా భూములని, తాము పట్టాదారుడి నుంచి లీజుకు తీసుకున్నామని లీజుదారులు తెలిపారు. పట్టాలు మంజూరు కాలేదని భూ నిర్వాసితులు ఆరోపించారు. ఇతర ప్రాంతంలో ఉన్న డీ ఫారమ్ పట్టాదారులు స్టేట్‌మెంట్ ఇచ్చే వరకు రెవెన్యూ అధికారులు సర్వే నంబరు 5లో భూములను స్వాధీనం చేసుకున్నట్టు ప్రకటించి, బోర్డు పెట్టారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ఇరువర్గాలు భూముల్లోకి రాకుండా స్వాధీనం చేసుకున్న భూముల వద్ద గురువారం పోలీసు భద్రత కల్పించారు.


స్వాధీనం చేసుకున్న భూములకు పహారా కాస్తున్న పోలీసులు

గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయాలి

» ఎస్పీ దీపికకు స్పీకర్ ఆదేశం

నర్సీపట్నం, జూలై 18: జిల్లాలో గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఎం.దీపికను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. స్పీకర్ అయ్యన్నను గురువారం ఎస్పీ దీపిక మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుండడంతో యువత పెడదోవ పడుతోందని తెలిపారు. గంజాయి రవాణాను అరికట్టి, నేరాల సంఖ్య తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు అవసరమైన స్థలాలు పరిశీలిస్తే, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లి వాటి నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసిన ఎస్పీ ఎం.దీపిక

గంజాయి నియంత్రణకు ప్రత్యేక నిఘా

మాకవరపాలెం, జూలై 18: గంజాయి రవాణాను నియంత్రించడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని నర్సీపట్నం రూరల్ సీఐని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. గురువారం ఆమె మాకవరపాలెం పోలీస్ స్టేషను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కంచాలన్నారు. అలాగే చెడు ప్రవర్తన ఉన్న వ్యక్తులపై నిరంతరం నిఘా కొనసాగించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఉన్న గంజాయి వాహనాలు, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట నర్సీపట్నం రూరల్ సీఐ హరినాథ్, మాకవరపాలెం ఎస్ఐ రామకృష్ణారావు వున్నారు.


మాకవరపాలెం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

ఏయూలో ఏం జరుగుతోంది?

» ప్రసాదరెడ్డి బృందానికే కీలక పదవులు

» ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావు అందులో సభ్యుడే

» ఎమ్మెల్యేలకు చెప్పకుండానే నియామకం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సంబంధించి గత నెల రోజులుగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అందరినీ విస్మయానికి గురిచేస్తున్నాయి. మొన్నటి వరకు వీసీగా పనిచేసిన ప్రసాదరెడ్డి యూనివర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చేశారు. అన్ని విభాగాలను తన మనుషులు, వైసీపీ అనుకూలురుతో నింపేశారు. తప్పనిసరి స్థితిలో పదవికి రాజీనామా చేశారు. ఆయన వెళుతూ వెళుతూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కిశోర్‌ను నియమించారు. ఆయన ప్రసాదరెడ్డి మనిషి. అటువంటి వ్యక్తి నియామకానికి కూటమి ప్రభుత్వం ఎలా అంగీకరించిందన్నది ఇప్పటికీ ఎవరికీ అంతుబట్టడం లేదు. అందులో నుంచి తేరుకోకముందే గురువారం ఇన్‌చార్జి వీసీగా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శశిభూషణరావును నియమించడం, ఆయన బాధ్యతలు స్వీకరించడం జరిగిపోయాయి. ఆయన కూడా ప్రసాదరెడ్డి బృందంలో చాలా ప్రధానమైన వ్యక్తి. వీసీ పదవిలో ప్రసాదరెడ్డి ఉంటే ఏమి చేస్తారో...శశిభూషణరావు ఉన్నా అదే చేస్తారనే ప్రచారం క్యాంపస్‌లో ఉంది. ప్రసాదరెడ్డి తన హయాంలో టీడీపీ సానుభూతిపరులైన సిబ్బందిని తీవ్రంగా వేధించారు. బోధన సిబ్బందికి పదోన్నతులు కల్పించకుండా, ఇతర అవకాశాలు ఏమీ దక్కకుండా తొక్కేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చినా అదే పరిస్థితి కొనసాగేలా ఉంది. వీసీ పదవికి ప్రసాదరెడ్డి రాజీనామా చేసిన ఇప్పటికీ యూనివర్సిటీలో ఆయన మాటే వేదంగా సాగుతోంది. ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్లు ఇద్దరూ ఆయన మనుషులే కావడం గమనార్హం. ఈ నియామకాలకు సంబంధించి పార్టీ అధిష్ఠానం జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలెవరితోను సంప్రతించలేదు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు విశాఖలోనే ఉన్నారు. ఆయన భార్య లావణ్య ఏయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్. ఆమె ఎన్నికల ప్రచారం పాల్గొన్నారని ప్రసాదరెడ్డి సస్పెండ్ చేయించారు. అన్ని వేధింపులు ఎదుర్కొన్న పల్లాకు కూడా ఏయూ ఇన్‌చార్జి వీసీని నియమిస్తున్న విషయం చెప్పలేదని సమాచారం.

యువ నాయకుడి సిఫారసు

జిల్లాలో టీడీపీ యువ నాయకుడిగా చెలామణి అవుతున్న వ్యక్తి కూటమి అధికారంలోకి రాగానే పదవులు ఇప్పిస్తానంటూ ప్రచారం చేసుకున్నారు. ఇప్పుడు ఏయూ ఇన్‌చార్జి వీసీ నియామకం వెనుక ఆయన సిఫారసు ఉందని ప్రచారం జరుగుతోంది. ఆయన టీడీపీలో ఉంటూ వైసీపీకి చెందిన వారికి పదవులు ఇమ్మని ఎలా సిఫారసు చేశారు?, దానిని పెద్దలు ఎలా ఆమోదించారు? అనేది ఎవరికీ అర్థం కావడం లేదు.

సింహాద్రి ఎన్టీపీసీకి ఈహెచ్ఎస్ అవార్డు

పరవాడ, జూలై 18 : పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న సింహాద్రి ఎన్టీపీసీకి గ్లోబల్ ఈహెచ్ఎస్-2024 అవార్డు వరించింది. థాయిలాండ్‌లోని గ్రీన్ టెక్ ఫౌండేషన్ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. పర్యావరణ పరిరక్షణకు నిరంతర కృషి చేస్తున్నందుకు గ్రీన్‌టెక్ సంస్థ అవార్డుకు ఎంపిక చేసింది. బుధవారం అవార్డుతో పాటు సర్టిఫికెట్ కూడా అందజేసినట్టు సింహాద్రి ఎన్టీపీసీ పీఆర్‌ఓ అఖిలేష్ త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు.



ఈహెచ్ఎస్ అవార్డుతో పాటు సర్టిఫికెట్

22 నుంచి పాఠశాలల్లో శిక్షా సప్తాహ్

» డీఈవో బ్రహ్మాజీరావు



పాడేరు రూరల్, జూలై 18 : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తరువాత పరివర్తనాత్మక సంస్కరణలపై, దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధి చేయడంలో నిబద్ధతను తెలియజేసే దిశగా ఈ కార్యక్రమాలన్ని చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 22వ తేదీన ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రి తయారుచేసి ప్రదర్శించడం, 23న పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్ర నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడానికి సమాజ భాగస్వాములకు అవగాహన కల్పించడం, 24న క్రీడా దినోత్సవం విద్యార్థులతో క్రీడలు, శారీరక సౌష్టవం ప్రాధాన్యం తెలియజేసేందుకు క్రీడా పోటీలను నిర్వహించడం, 25న సాంస్కృతిక దినోత్సవం, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర కృత్యాలు, పాఠశాలలో పోషణ దినోత్సవ నిర్వాహణ, 28వ తేదీన సామాజిక భాగస్వామ్య దినోత్సవం, పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం వంటివి నిర్వహించనున్నట్టు చెప్పారు.

జనసేన సభ్యత్వంతో ప్రతి కార్యకర్తకు భరోసా

» పార్టీ మండల అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్



సభ్యత్వ రశీదులను చూపుతున్న లక్ష్మణ్, జనసేన నేతలు

కొయ్యూరు, జూలై 18 : జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతీ జన సైనికుడు, కార్యకర్త, వీర మహిళతో పాటు వారి కుటుంబాలకు భరోసా కల్పించటమే ధ్యేయంగా అధినేత పవన్‌కల్యాణ్ పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు రూపొందించారని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్ పేర్కొన్నారు. జనసేన పార్టీ నాలుగో విడత క్రియాశీల సభ్యత్వ నమోదును గురువారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ పార్టీకి చెందిన ప్రతి ఒక్కరి క్షేమమే ధ్యేయంగా సభ్యత్వ నమోదు ఉండేలా పవన్‌కల్యాణ్ చర్యలు చేపట్టారన్నారు. ఈ నెల 28 వరకు సభ్యత్వ నమోదు నిర్వహించనున్నట్టు చెప్పారు. సభ్యత్వం నమోదుపై ఆసక్తి ఉన్న వారు ఫోన్ : 94924 55768, 85007 99424లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు సెగ్గే భావన, సాగిన బుజ్జిబాబు, పీటా సుధీర్ బాబు, రాఘవరాజు బంగారుబాబు, సీహెచ్ సిద్ధూ, రాంప్రసాద్‌పాల్గొన్నారు.

చింతవానిపాలెంలో వైద్య పరీక్షలు



స్థానికులకు సూచనలు ఇస్తున్న వైద్య సిబ్బంది

కొయ్యూరు, జూలై 18 : కొయ్యూరు పంచాయతీ చింతవానిపాలెంలో గురువారం జ్వర పీడితులను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో సీహెచ్‌వో ప్రశాంత్, హెచ్‌వీ భూలోక ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది గురువారం ఇంటింటికీ వెళ్లి రక్త పరీక్షలు నిర్వహించారు మొత్తం 51 మంది నుంచి రక్తపూతలు సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అలాగే దోమల నివారణ చర్యల్లో భాగంగా స్ప్రేయింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం చెల్లయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం నిర్మించండి



ఆందోళన చేస్తున్న టీడీపీ నేత పాండురంగారావు, విద్యార్థుల తల్లిదండ్రులు

ముంచంగిపుట్టు, జూలై 18 : పెదగూడ పంచాయతీ పనస గ్రామంలో నూతన పాఠశాల భవనం నిర్మించాలని టీడీపీ పార్టీ డివిజన్ నేత పి.పాండురంగస్వామి కోరారు. గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి ఆయన పాఠశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం స్థానంలో కొత్తది నిర్మించాలన్నారు. గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న చిన్న రేకుల షెడ్డులోనే గత కొన్నేళ్లుగా పాఠశాల కొనసాగుతుండడం విచారకరమన్నారు. ప్రస్తుతం వర్షాలు పడటంతో షెడ్డు మొత్తం కారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు లోపల కూర్చునే అవకాశం కూడా లేదన్నారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే ఎంఈవో కార్యాలయం ఆవరణలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నిర్దేశిత సమయంలో ఆధార్ సర్వే పూర్తి : ఎంపీడీవో

గూడెంకొత్తవీధి, జూలై 18 : ఆధార్ సర్వేను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. గురువారం ఆయన మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 27 వరకు జరిగే ఆధార్ క్యాంపుల నిర్వహణపై చర్చించారు. ఆధార్ కేంద్రాల్లో బయోమెట్రిక్ అప్‌డేట్ చేయాలని, 10 సంవత్సరాలు దాటిన వారైతే వారికి సంబంధించిన ధ్రువపత్రాలనుఅందించి అప్‌డేట్ చేయించుకునేలా చూడాలని సూచించారు. అలాగే 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు కొత్త ఆధార్ కార్డులను నమోదు చేయాలన్నారు. అదేవిధంగా మరుగుదొడ్లు, హౌసింగ్ పనులను కూడా పూర్తి చేయాలని హౌసింగ్ జేఈ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీకి సంబంధించి 90 రోజుల ఉపాధి పనులను పూర్తి చేయించాలని ఆదేశించారు.

ఈ-క్రాప్ తప్పనిసరి : వ్యవసాయశాఖ ఏడీ



అరకులోయ, జూలై 18 : గిరి రైతులు వ్యవసాయ కాలంలో వారు పండించిన పంటలకు అనుగుణంగా విధిగా ఈ క్రాప్‌లో (ఈ-పంట)లో పేరు నమోదు చేసుకోవాలని అరకులోయ వ్యవసాయశాఖ సబ్ డివిజన్ ఏడీ మోహనరావు స్పష్టం చేశారు. గురువారం ఏడీ కార్యాలయ ఆవరణలో రైతులకు డీఏపీ, యూరియా పంపిణీ చేశారు. ప్రస్తుతం అరకులోయ, డుంబ్రిగుడ మండలాల పరిధిలో 12 మెట్రిక్ టన్నుల యూరియా, 12 మెట్రిక్ టన్నుల డీఏపీ స్టాకు ఒక్కో మండలానికి పంపిణీకి సిద్ధంగా ఉందన్నారు. మరో దఫా స్టాకు రానుందన్నారు. మిగిలిన రెండు మండలాలు అనంతగిరి, హుకుంపేట కోసం ప్రతిపాదనలు పంపామని, త్వరలో స్టాకు ఆ మండలాలకు చేరుతుందన్నారు.

వైసీపీ హయాంలో భూకబ్జాలు

» సహజ వనరులు దోచేశారు
» ప్రతి పైసా ప్రజాఖాజానాలో జమ చేస్తాం
» టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి



విలేకరులతో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, జూలై 18 : వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో భూదందాలు, సహజవనరుల దోపిడీలు యథేచ్ఛగా జరిగాయని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీవో 512 రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆమె నివాసగృహం కుమ్మరిపుట్టులో విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు తెలియ జేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రాలు విడుదల చేస్తోందన్నారు. రాష్ట్రంలో సుమారు 1.75 ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయని వాటి విలువ రూ. 35.576 కోట్లు పైనే ఉంటుందని ఆరోపించారు. ఇళ్ల పట్టాల పేరుతో 10 వేల ఎకరాలు, ఇసుక దందాలో రూ.9.750 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో పాడేరు ఎమ్మెల్యేగా ఉన్న కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి వైసీపీ ప్యాలెస్ నిర్మాణానికి రెండు ఎకరాల భూమిని కబ్జా చేసి తిరిగేలమెట్టను మినీ రుషికొండగా మార్చారని విమర్శించారు. పార్టీ పేరుతో ఆ స్థలాన్ని ఆమె దోచుకున్నారని ఆరోపించారు. ప్రజా ధనాన్ని కొల్లగొట్టిన వైసీపీ నాయకుల నుంచి ప్రతీ పైసా వసూలు చేసి ప్రజా ఖజానాకు జమ కడతామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకటసురేష్‌కుమార్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, నక్క రాంబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఎంవీవీ

మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణకు టీడీపీ నేతల ఘన నివాళి



ఎంవీవీకి నివాళులు అర్పిస్తున్న కుటుంబసభ్యులు, టీడీపీ నేతలు

కొయ్యూరు జూలై 18 : మాజీ ఎమ్మెల్యే ఎంవీవీ సత్యనారాయణ చిరస్మరణీయులని పలువురు నేతలు కొనియాడారు. చింతపల్లి మాజీ ఎమ్మెల్యే, దివంగత ఎంవీవీ సత్యనారాయణ 17వ వర్ధంతిని గురువారం కొయ్యూరులోని ఎంవీవీ స్వగృహంలో ఆయన కుటుంబీకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరుతో పాటు వివిధ మండలాలకు చెందిన పలువురు నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు దఫాలు ఎమ్మెల్యేగా నియోజకవర్గాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ప్రశంసించారు. మన్యంలో టీడీపీ పటిష్టతకు ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. ఎంవీవీ తనయుడు ప్రసాద్ మాట్లాడుతూ నాన్న మరణానంతరం రాజకీయాలకు దూరంగా ఉండాల ని నిర్ణయించుకున్నా పార్టీ అధినేత సూచనతో తిరిగి రాజకీయాల్లో చురుగ్గా ఉన్నానన్నారు.ఆయన ఆశయ సాధనకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. అనంతరం సుమారు 100 మంది నిరుపేదలకు కుటుంబీకులు సమకూర్చిన దుస్తులను రాజేంద్రపాలెం, రేవళ్ళు, రావణాపల్లి సర్పంచ్‌ల చేతుల మీదుగా అందించారు. కార్య క్రమంలో పలువురు నేతలు, స్థానిక నేతలు మోటారు వర్కర్ల యూని యన్ నేతలు అల్లూరి యూత్ సభ్యులు, పలువురు మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

చింతపల్లి : మాజీ ఎమ్మెల్యే ఎంవీవీ సత్యనారాయణవర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో టీడీపీ నాయకులు గురువారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బేరా సత్యనారాయణ, నేతలు పెదిరెడ్ల బేతాళుడు, కిముడు లక్ష్మయ్య, రామ్మూర్తి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి : దివంగత టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ముక్కలి మహేష్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే సేవలను గుర్తు చేసుకున్నారు. తెలుగు యువత మండల అధ్యక్షులు ముర్ల కోటేశ్వరావు, గంటా నళిని, పసుపులేటి రామకృష్ణ, తగ్గి శారద పాల్గొన్నారు.

డీఎల్‌పీవో కుమార్‌కు సన్మానం



డీఎల్‌పీ కుమార్‌ను సన్మానిస్తున్న పీఆర్ ఉద్యోగులు

చింతపల్లి/ పాడేరు రూరల్, జూలై 18 : ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీరాజ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన డీఎల్‌పీవో పీఎస్ కుమార్‌ను గురువారం మండలానికి చెందిన పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు సన్మానించారు.

ఈ సందర్భంగా చింతపల్లి ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీరాజ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా డీఎల్‌పీవో ఎన్నిక కావడం సంతోషకరమన్నారు.

ఎంపీపీ కుమారి విమర్శలు అర్థరహితం

టీడీపీ నేతల ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న జీకే వీధి మండల టీడీపీ నేతలు

గూడెంకొత్తవీధి, జూలై 18 : గిరిజన ప్రాంతంలో గంజాయి వంటి మత్తు పదార్థాలు నియంత్రణకు తొలి నుంచి తెలుగు దేశం పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తోందని మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. గురువారం వీరు విలేక రులతో మాట్లాడుతూ గూడెంకొత్తవీధి ఎంపీపీ బోయిన కుమారి వాస్తవాలను తెలియకుండా మాట్లాడటం సరికాదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే గిరిజన ప్రాంతంలో గంజాయి సాగు ఎక్కువగా జరిగిందని ఆరోపించారు. గిరిజన వసతి గృహాల్లో ప్రస్తుతం ఉన్న వాస్తవాలనుమాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతుంటే ఎంపీపీ జీర్ణించుకోలేకపోతున్నారని, ఎవరు మతిభ్రమించి మాట్లాడుతున్నారో, ఎవరు మానసిక వైద్యం చేయించుకోవాలో అందరికీ తెలుసన్నారు. స్థానిక ఎంపీపీకి త్వరలోనే బుద్ధి వచ్చేలా చేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కలి మహేశ్, తెలుగుయువత అధ్యక్షుడు కోటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ గంటా నళిని, మాజీ సర్పంచ్ పసుపులేటి రామకృష్ణ, నాయకెలు ముక్కలి వాసుదేవ రావు, జుర్రా గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాయితీ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు



రైతులకు సూచనలు ఇస్తున్న శ్రీనివాసరావు

చింతపల్లి, జూలై 18 : ఆదివాసీలు రాయితీ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం చౌడుపల్లి, గాడిదలమెట్ట గ్రామాల్లో రైతులు యంత్ర సేవా పథకం ద్వారా 50శాతం రాయితీపై పొందిన వ్యవసాయ యంత్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ యంత్ర సేవా పథకం ద్వారా ట్రాక్టర్, టిల్లర్ యంత్రాలను రైతులు వ్యవసాయ పనుల్లో వినియోగించుకుంటున్నారన్నారు. యంత్రాల వల్ల సమయం ఆదా కావడంతో పాటూ కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. అలాగే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి పొలాలు, నారు మడులు కుళ్లి పోకుండగా ఉండేందుకు వర్షపు నీరు బయటకు పోయేందుకు బోదెలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వరి పొలాల్లో బాటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల రైతులు సులభంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు పిచికారి చేసుకోవచ్చునన్నారు. అలాగే వరి నాట్లు వేసే సమయంలోనూ ఎనిమిది, ఐదు వరుసలకు ఒక వరుస వదిలిపెట్టి నాట్లు వేసుకోవాలన్నారు.

మన్యంలో ముసురు



భారీ వర్షానికి నేల మట్టమైన ఇల్లు

... 5వ పేజీ తరువాయి

గిరిజనుడి నివాస గృహం బుధవారం రాత్రి కూలిపోయింది. నివాస గృహం కూలిపోవడంతో నిత్యావసర సరుకులతోపాటు ధాన్యం, బోళ్లు, విలువైన సామగ్రి పూర్తిగా పాడైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం స్పందించి తక్షణమే ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

వరి నాట్లలో కాలిబాటలు తప్పనిసరి

» జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.తేజేశ్వరరావు



రైతులకు సూచనలిస్తున్న తేజేశ్వరరావు

పెదబయలు, జూలై 18 : వరినాట్లు వేసే రైతులు కాలిబాటలు తప్పనిసరి పాటించాలని అల్లూరి జిల్లా ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.తేజేశ్వరరావు పేర్కొన్నారు. ఆయన గురువారం గంపరాయి పంచాయతీ కేంద్రంలో వరినాట్లు వేసే పొలాల్లో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నారు చివర్లో తుంచటం వల్ల కాండం తొలిభాగంలో పురుగు గుడ్లు వంటివి ఉన్నట్లైతే అవి మొక్కకి హాని కలుగనీయకుండా నాశనం అవుతాయన్నారు. పొలంలో ఒక అంచునీటిలో ఒక కిలో సుడోమోనాస్ ద్రావణంలో వరి నారు వేళ్లను ముంచి 15 నిమిషాల తరువాత నాటుకుంటే నారుకు క్రిమికీటకాలు దరి చేరవని తద్వారా మొక్కకు తెగుళ్లు సోకవన్నారు. అలాగే కాలిబాటలను ప్రతీ రెండున్నర మీటర్ల నుంచి మూడు మీటర్లకు ఒకసారి తూర్పు, పడమర దిశలో కాలిబాటలు తీసుకోవటం వలన దోమలు వంటి రసం పీల్చే పురుగుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. అలాగే వరి దుబ్బు మొదళ్లకు గాలి, వెలుతురు బాగా అందుతుందన్నారు. ప్రధానంగా పంటను పరిశీలించటం సులభమవుతుందని సూచించారు. వరి పంటలో యాంత్రీకరణ పెరగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సచివాలయ వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

బర్త్ సర్టిఫికెట్‌కు వసూళ్లపై డీసీహెచ్‌ఎస్ విచారణ

... 5వ పేజీ తరువాయి

డీసీహెచ్‌ఎస్ వైద్యాధికారులు, దిగువ స్థాయి ఉద్యోగులను విచారించారు. జనన ధ్రువీకరణ పత్రానికి జారీ చేసేందుకు నోటరీ చేయించాలని, నోటరీ చేయించేందుకు సూపరింటెండెంట్ రూ.500 తీసుకుంటున్నారని వైద్యులు, దిగువ స్థాయి ఉద్యోగులతో పాటు బాధితులు డీసీహెచ్‌ఎస్‌కి వివరించారు. అలాగే వైద్యాధికారులు జీతాల బిల్లు ట్రెజరీకి పెట్టేందుకు కూడా కొంత నగదు సూపరింటెండెంట్ తీసుకున్నారని వైద్యాధికారులు ఫిర్యాదు చేశారు. దిగువ స్థాయి ఉద్యోగులు సైతం వేతనాలు పొందేందుకు రూ.500 నుంచి రూ.వెయ్యి చొప్పున సూపరింటెండెంట్‌కి ఇచ్చామని తెలిపారు. ఈమేరకు డీసీహెచ్‌ఎస్ మాట్లాడుతూ 21రోజులలోపు జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసేందుకు ఎటువంటి నోటరీ అవసరం లేదన్నారు. జనన ధ్రువీకరణ పత్రం అవసరమైన వ్యక్తులే నోటరీ చేయించుకోవాలని, ఆస్పత్రి సిబ్బంది చేయించరాదన్నారు. జనన ధ్రువీకరణ పత్రం కోసం నగదు తీసుకోరాదన్నారు. సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్ అందుబాటులో లేరని, ప్రస్తుతం సెలవులో ఉన్నారన్నారు. సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్‌ను విచారించాల్సి వున్నదన్నారు. ప్రాథమిక విచారణ నివేదికనుఐటీడీఏ పీవోకి అందజేస్తామన్నారు. తదుపరి చర్యలు ఐటీడీఏ పీవో తీసుకుంటారని డీసీహెచ్‌ఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మినుములూరులో వైద్య పరీక్షలు

పాడేరు రూరల్, జూలై 18 : మన్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖాధికారులు అప్రమత్తమై గ్రామాల్లో ఇంటింట వైద్య పరీక్షలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా ఆదేశాల మేరకు మినుములూరు సబ్ సెంటర్ పరిధిలో వైద్య సిబ్బంది విస్తృతంగా పర్యటించి జీడిపగడ, అల్లెరు, బంగారుమెట్ట, బిరిమిశాల, చింతగున్నలు, మాతికిబంద, వరంకూర, వనుగుపల్లి, తామరాపల్లి గ్రామాల్లో ప్రతీ వ్యక్తి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

గిరి యువత గంజాయి జోలికి పోవద్దు

... 5వ పేజీ తరువాయి

మారుమూల గ్రామాల్లో గిరిజన రైతులు ఇప్పటికైనా గంజాయి సాగుకు దూరంగా ఉండాలన్నారు. అటువంటి రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలను సాగుకు ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్‌కుమార్, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, టీడీపీ నాయకులు నక్క రాంబాబు, పి.సత్తిబాబు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

అంగన్‌వాడీ గుడ్లు తరలింపుపై విచారణ

సీలేరు, జూలై 18 : జీకే వీధి మండలం ధారకొండ పంచాయతీ కమ్మరితోట అంగన్‌వాడీ కేంద్రం నుంచి గడ్లు, పాలు మార్కెట్‌కు తరలిపోతున్నా యంటూ విమర్శలు రావడంతో గురువారం ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సీడీపీవో లక్ష్మి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా విచారణాధికారి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తాను లేనప్పుడు తన భర్త 5 ట్రేల గుడ్లు, రెండు పాల ప్యాకెట్లు తీసుకొని వెళ్లినట్టు అంగన్‌వాడీ కార్యకర్త రెడ్డి జయంతి తెలిపిందని చెప్పారు. అలాగే ప్రత్యక్ష సాక్షులు కూడా ఇదే చెప్పారని ఎంపీడీవో తెలిపారు. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా కలెక్టర్, ఐసీడీఎస్ పీవోకు అందించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మోహినీ గ్రామస్థులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

» ఏవో నీలవేణి

డుంబ్రిగుడ, జూలై 18 : మండలంలోని అరుమ, డుంబ్రిగుడ రైతుసేవ కేంద్రాల్లో రైతుల కోసం ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి నీలవేణి అన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువులు కావాల్సిన రైతులు ఆధార్ కార్డ్, పట్టా-1బి, ఫోన్ నెంబరు తీసుకుని రైతు సేవ కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. అరుమ రైతు సేవా కేంద్రంలో 12 టన్నులు డీఏఫ్ ఉందని, డుంబ్రిగుడలో 12 టన్నులు ఉన్నాయన్నారు. 50 కేజీల బస్తా 1350 రూపాయలుగా పేర్కొన్నారు. మిగతా రైతు సేవ కేంద్రాల్లో సైతం రెండు, మూడు రోజుల్లో అందుబాటులో ఉంటాయని ఏవో తెలిపారు.

ఆధార్ సర్వే 40 శాతం పూర్తి

» ఎంపీడీవో సీతయ్య

కొయ్యూరు, జూలై 18 : మండలంలో ఆధార్ సర్వే 40 శాతం పూర్తయిందని ఎంపీడీవో లాలం సీతయ్య నాయుడు తెలిపారు. ఆధార్ కార్డు తీసుకుని తొమ్మిదేళ్లపూర్తయిన వారు అప్‌డేట్ చేశారా? లేదా? అలాగే ఇప్పటి వరకూ ఆధార్ కార్డులు లేని వారు ఎంత మంది ఉన్నారు అనే దానిపై గ్రామ సచివాలయ సిబ్బందితో సర్వే చేస్తున్నామన్నారు. ఈ వారంలో సర్వే శత శాతం పూర్తవుతోందని చెప్పారు. ప్రస్తుతం మూడు కేంద్రాల్లో ఆధార్ నమోదు, నవీకరణ జరుగుతోందని ఎంపీడీవో తెలిపారు.

నేడు పింఛన్ల అవకతవకలపై విచారణ

కొయ్యూరు, జూలై 18 : మూలపేట పంచాయతీ జాబులబంధ గ్రామంలో ఏప్రిల్, మే నెలలకు సంబంధించి నలుగురు వృద్ధాప్య పింఛన్లు బట్వాడా చేయలేదని అందిన ఫిర్యాదుపై శుక్రవారం గ్రామంలో విచారణ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సీతయ్యనాయుడు తెలిపారు. పింఛనుదారులైన పాంగి బిమ, పాంగి రామారావు, వంతల కోనే, పాంగి సుబ్బారావులు గత ఏప్రిల్, మే నెలల పింఛను తమకు అందలేదంటూ ఐటీడీఏ పీవోకు పిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పీవో తక్షణం ఈ విషయమై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇందుకోసం మూలపేట పంచాయతీ కార్యదర్శి ఎస్.రవీంద్ర, బాలారం పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికుమార్‌లను విచారణ అధికారులుగా నియమించి గురువారం విచారణకు ఆదేశించామన్నారు. వీరు విచారణ చేపట్టి నివేదికను పీవోకు సమర్పిస్తామని ఎంపీడీవో తెలిపారు.

రాత్రి వేళలో అనవసరంగా తిరగవద్దు

» ఎస్ఐ రవీంద్ర

ముంచంగిపుట్టు, జూలై 18 : రాత్రి వేళల్లో ఎవరూ పనిలేకుండా అనవసరంగా తిరగరాదని ఎస్ఐ కె.రవీంద్ర అన్నారు. గురువారం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ కొద్ది రోజులుగా ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో జరుగుతున్న దొంగతనాల దృష్ట్యా రాత్రి వేళల్లో పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పని లేకుండా ఎవరూ రాత్రి 11 దాటితే బయటకు రాకూడదని తెలిపారు. ఎవరైనా వస్తే స్టేషన్‌కు తరలించడం జరుగుతుందని, స్పష్టమైన సమాధానం చెప్పకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులు కనిపించినా, ఎలాంటి అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా ఎక్కువ రోజులపాటు ఊర్లకు వెళ్తే తమకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

హైవే నిర్వాసితుల ధ్రువపత్రాల పరిశీలన

జి.మాడుగుల, జూలై 18 : జాతీయ రహదారి 516ఈ బాధితులకు పరిహారం అందజేసే ప్రకియలో భాగంగా ఆ శాఖ అధికారులు గురువారం ధ్రువపత్రలను పరిశీలించారు. మత్స్యపురం. సంతబయలు, జి.మాడుగులలో వివిధ షాపులు కోల్పోయిన బాధితల ధ్రువపత్రాలను పరిశీలించారు. త్వరలో పరిహారం అందజేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో హైవే అధికారులు పాల్గొన్నారు.

పూజారి ప్రసాద్ దంపతులకు సన్మానం



ప్రసాద్ దంపతును సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

సీలేరు, జూలై 18 : జీకేవీధి మండలం సీలేరు సాయిబాబాఆలయంలో గురువారం మారెమ్మ ఆలయం పూజారి ప్రసాద్ దంపతులను బాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వీరు 20 ఏళ్ళుగా సీలేరులోని మారెమ్మ ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయాల్లో అర్చకులుగా పని చేసిన సేవలకు గుర్తించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మారెమ్మ ఆలయ కమిటీ కార్యదర్శి కారే శ్రీనివాస్, శివాలయం కమిటీ కార్యదర్శ డి. నాగేశ్వరరావు, రామాలయం కమిటీ సభ్యులు గణేష్, వెంకటరావు, టీడీపీ నాయకుడు చిటికెల రాము, బీజేపీ నాయకుడు కారే అప్పలరాజు, కాంగ్రెస్ నాయకుడు వానపల్లి అప్పారావు, వర్తకసంఘం అధ్యక్షుడు సిద్ధూ, సాయితత్సంగం మహిళలు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

చింతపల్లి, జూలై 18 : జనసేన పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ఆ పార్టీ మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు తెలిపారు. గురువారం మండల కేంద్రం రామాలయం వీధిలో సభ్యత్వాల నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాపు జిల్లా అధ్యక్షుడు దూనబోయిన రమణ, వర్తకసంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు పాల్గొన్నారు.